క్లుప్తంగా

మంత్రి రాజశేఖర్‌కు అభినందన



మంత్రి రాజశేఖర్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న భోగవల్లి నాగభూషణం

మల్కాపురం: ఎంఈఎస్ స్టాఫ్ అండ్ వర్క్‌మెన్ యూనియన్ అధ్యక్షుడిగా ఇంటక్ నగర అధ్యక్షుడు మంత్రి రాజశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో ఆయనకు అభినందనలు వెల్లువెత్తాయి. యూనియన్ కార్యాలయంలో శనివారం మంత్రి రాజశేఖర్‌ను ఇంటక్ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం,ఎంఈఎస్ స్టాఫ్ అండ్ వర్క్‌మెన్ యూనియన్ నాయకులు,సభ్యులు కలిసి అభినందించారు. ఇలాంటి పదవులు మరిన్ని చేపట్టాలని భోగవల్లి ఆకాంక్షించారు.

సంపత్ వెంకన్న ఆలయంలో ప్రత్యేక పూజలు



వెంకన్నకు హారతి ఇస్తున్న ఆలయ అర్చకుడు శ్యామాచార్యులు

కంచరపాలెం: స్థానిక గొల్లకంచరపాలెం కోదండ సీతారామ, ధనలక్ష్మి దేవి, సంపత్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైశాఖ మాస శుద్ధ విదియ శనివారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు శ్యామాచార్యులు ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, విశేష పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేంకటేశ్వరస్వామి పద్మావతి, ఆలివేలు మంగమ్మకు ప్రాతఃకాల తిరువారాధన, అష్టోత్తరాలు, తులసీ దళబిల్వార్చన, ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరామా సేవా సమాజం (యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేశారు.

క్రీడల్లో రాణిస్తే గుర్తింపు



పతకాలు సాధించిన క్రీడాకారులతో ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం: చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే గణబాబు అన్నారు. ఇటీవల జరిగిన రెండో బ్రోకెన్ స్కాల్ స్పోర్ట్స్ ఓపెన్ నేషనల్ బాక్సింగ్ చాంపియన్ షిప్ 2023 పోటీల్లో గోపాలపట్నం పరిసర ప్రాంతాల చిన్నారులు పలు పతకాలు సాధించారు. వీరిని ఎమ్మెల్యే శనివారం అభినందించారు. 8 మంది చిన్నారులు రెండు బంగారు, రెండు సిల్వర్, బ్రాంజ్ పతకాలు దక్కించుకున్నారు. వీరంతా గోపాలపట్నం జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలో శిక్షణ పొందుతున్నారు. బాక్సింగ్ కోచ్ సంద్రాని శ్రీనివాస్ ప్రభాకర్, కిరణ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

కలియుగ వెంకన్నకు విశేష పూజలు



ప్రత్యేక పూజల్లో అర్చకులు, భక్తులు

కంచరపాలెం: తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వైశాఖ మాస శుద్ధ విదియ సందర్భంగా శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శంకర్‌శర్మ, జగనాథశర్మ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, అర్చనలు, పంచామృతాభిషేకాలు జరిపారు. పద్మావతి, అలమేలు మంగమ్మ సమేత వెంకన్న స్వామిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవరావు, కార్యదర్శి రాజు నేతృత్వంలో ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయం వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు.

పబ్లిక్ డిమాండ్

వీధిలైట్లు వెలగక ఇబ్బందులు



అంధకారంలో దుర్గానగర్

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం తోట వీధి నుంచి దుర్గానగర్, గొల్లకంచరపాలెం ప్రాంతాలకు వెళ్లే రహదారిలో విద్యుత్ స్తంభాలకు లైట్లు లేవు. దీంతో రాత్రి వేళ చీకట్లలో నిత్యం ప్రయాణించాల్సి వస్తోంది. ఈ సమస్యపై స్పందన కార్యక్రమంలో వినతిపత్రాలు అందించినా.. అధికారులు పట్టించుకోవడం లేదు. పలు స్తంభాలకు విద్యుత్ లైట్లు లేకపోవడంతో కొందరు ఆకతాయిలు ద్విచక్ర వాహనాల నుంచి పెట్రోల్ దొంగిలిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి స్తంభాలకు లైట్లు అమర్చాలి.

– సుధీర్‌కుమార్, తోట వీధి

కాలువపై విరిగిన సిమెంట్ దిమ్మె



దయానందనగర్‌లో ప్రమాదకరంగా కాలువ

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం చాకలిగెడ్డ దయానందనగర్ ప్రాంతంలోని కాలువలపై సిమెంటు దిమ్మెలు విరిగిపోయాయి. అటుగా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహన చోదకులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కాలువలపై సిమెంటు దిమ్మెలు శిథిలావస్థకు చేరి ప్రమాదభరితంగా మారాయి. అధికారులు స్పందించి విరిగిన సిమెంట్ దిమ్మెలను తొలగించి కొత్తవి వేయాలి.

– ఎం.నూకరాజు, దయానందనగర్

వ్యర్థాలు తొలగించరూ?



మల్కాపురం ప్రాథమిక పాఠశాల ముందు వేసిన వ్యర్థాలు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ముందు స్థానికులు నిర్లక్ష్యంగా వ్యర్థాలు డంప్ చేస్తున్నారు. వీటిని సకాలంలో తొలగించక పోవడంతో వ్యర్థాలపై పశువులు చేరి పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నాయి. వ్యర్థాలను తొలగించడంతో పాటు ఇక్కపై చెత్త వేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

–హరికృష్ణ, హరిజనవీధి

ఉత్సాహంగా 'మా నమ్మకం నువ్వే జగన్'



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు

సింథియా: నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్తూ మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగుతోంది. జీవీఎంసీ 62వ వార్డు జాలరివీధి సచివాయంలోని పలు ప్రాంతాల్లో శనివారం వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు కలిసి వార్డులోని ప్రతి ఇంటికి తిరుగుతూ గత ప్రభుత్వం కంటే ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు ఏ విధంగా మెరుగైన పాలన అందించిందో వివరించారు. ప్రతి ఇంటిని సందర్శిస్తూ ఇంటి గోడపై మా నమ్మకం నవ్వే జగన్ స్టిక్కర్లు అతికించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మద్దతు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు భీశెట్టి గణేష్, నాయకులు కామేశ్వరరావు, వెంకటరత్నం, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

సింథియా: మంచి పోషక విలువలతో కూడిన పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు అన్నారు. జీవీఎంసీ 40వ వార్డు పరిధి ఏకేసీ కాలనీలో వాసవ్య మహిళా కుషాల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ ఉషా శ్రావణి ఆధ్వర్యంలో మహిళలకు, బాలింతలు, గర్భిణీకుల పౌష్టికాహారం ఆవశ్యకతపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. రోజు తీసుకునే ఆహారంలో పోషకాలు అధికంగా ఉండేటట్లు చూసుకోవాలని సూచించారు.

ఉపాధ్యాయుల సస్పెన్షన్ రద్దు చేయాలి

- విద్యాశాఖ ముఖ్య కార్యదర్శికి వినతి



ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్‌కు వినతిపత్రం అందిస్తున్న మాజీ ఎమ్మెల్సీ గాదె, పీఆర్‌టీయూ నాయకులు

గోపాలపట్నం: పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన ఉపాధ్యాయుల సస్పెన్షన్‌ను రద్దు చేయాలని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్‌ను మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు, విశాఖ జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షుడు గోపీనాథ్ కోరారు. ఈ మేరకు విశాఖ విమానాశ్రయంలో శనివారం ఆయన్ని కలిసి వినతి పత్రం అందించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖలో మంచి మార్పులు తీసుకొస్తోందని.. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయడం మంచి పరిణామమన్నారు. పథకాల అమలు, విద్యార్థులకు అందే ప్రక్రియలో లోపాలు, కింది స్థాయి వరకు ఉన్న ఇబ్బందులపై కూడా దృష్టి సారించాలని కోరారు. ఉద్యోగులను మానసిక ఒత్తిడికి గురి చేస్తే అనుకున్న ఫలితాలు రాబట్టలేమన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో ఉపాధ్యాయ సంఘాలతో చర్చించినట్లయితే బోధన విధానాలు, పాఠశాల నిర్వహణ మరింత మెరుగవుతుందన్నారు. పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి మద్దు శ్రీనివాసరావు, విజయనగరం నగర అధ్యక్షుడు రామునాయుడు పాల్గొన్నారు.

చినజీయర్ స్వామికి సాదర స్వాగతం



విశాఖ విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న చినజీయర్ స్వామి

గోపాలపట్నం: విశాఖలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన త్రిదండి రామానుజ చినజీయర్ స్వామికి విశాఖ విమానాశ్రయంలో భక్తులు ఘనంగా స్వాగతం పలికారు. ఆయన శనివారం సాయంత్రం ఇండిగో విమానంలో విశాఖ చేరుకున్నారు. విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గాన నగరంలోకి వెళ్లారు.

చిత్ర పరిశ్రమకు విశాఖ అనుకూలం



మాట్లాడుతున్న ఆచార్య ప్రసాదరావు

సీతంపేట: చిత్ర పరిశ్రమ అభివృద్ధి చెందడానికి విశాఖ అనువైనదని ఏయూ మాజీ రెక్టార్ ఆచార్య ఎం.ప్రసాదరావు అన్నారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడు రోజుల ఆస్కార్ అవార్డుల ఫిల్మ్ ఫెస్టివల్‌లో భాగంగా శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆస్కార్ బెస్ట్ ఫిల్మ్, 7 అవార్డులు పొందిన ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్ చిత్రాన్ని ప్రదర్శించారు. దీనికి ముందుగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహణకు కూడా అనుకూలమైన ప్రాంతమని, ఆ దిశగా ప్రభుత్వాలు ఆలోచించాలని సూచించారు. మానవ సంబంధాలు, కుటుంబ సంబంధాలు ప్రపంచంలో ఏదీ శాశ్వతం కాదనే సందేశాన్ని ఎవ్రీథింగ్ చిత్రంలో చక్కగా చూపారన్నారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు ×ది వేల్ చిత్రాన్ని ప్రదర్శిస్తామని నిర్వాహకుడు నరవ ప్రకాశరావు తెలిపారు. కార్యక్రమంలో బి. చిన్నారావు, అనూరాధ, హరనాథ్ పాల్గొన్నారు.

వైభవుడికి సుప్రభాత సేవ



ఆలయ ప్రదక్షిణలో అర్చకులు, భక్తులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిగింది. సాయంత్రం 6.30 గంటలకు నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు వైభవుడికి సమర్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేల తల్లిని స్మరించే గొప్ప సంస్కృతి మనది

ధరిత్రి దినోత్సవంలో చినజీయర్ స్వామి అనుగ్రహభాషణం



ప్రసంగిస్తున్న చినజీయర్ స్వామి

ఏయూక్యాంపస్: పుడమి పరిరక్షణలో ప్రతి వ్యక్తి తన బాధ్యతను గుర్తెరిగి నడచుకోవాలని చినజీయర్ స్వామి అన్నారు. శనివారం సాయంత్రం ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో వికాస తరంగిణి నిర్వహించిన మన భూమి మన బాధ్యత కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులనుద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. విశ్వంలో సమస్త ప్రాణికోటితో మానవ జీవనం ముడిపడి ఉందనే విషయం విస్మరించరాదని సూచించారు. నిత్యం ఉదయం నిద్రలేస్తూనే నేలతల్లిని నమస్కరించి, స్మరించే గొప్ప సంస్కృతి మన సొంతమన్నారు. మనమంతా నేలతల్లి ఒడిలో ఆటలాడే పిల్లలమన్నారు. ధరిత్రీ పరిరక్షణకై మనలో మనం ఆలోచన చేయాల్సిన అవసరాన్ని వివరించారు. నేలను తల్లిగా భావించడం వేదకాలం నుంచి ఉందన్నారు. విశ్వంలో మన స్థానం ఏంటని ఒకసారి మానవులు ప్రశ్నించుకోవాలన్నారు. గాలి,నీరు, ప్రాణికోటి బాగుంటేనే మనం బాగుంటామనే విషయం మరువకూడదన్నారు.

అహోబిల జీయర్ స్వామి మాట్లాడుతూ యువశక్తి సమాజ హితాన్ని కాంక్షించాలన్నారు. ఆదర్శవంతమైన జీవనం సాగించడం అలవరచుకోవాలని సూచించారు. మంచి భావన వలన మంచి ఫలితం కలుగుతుందన్నారు. ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి మాట్లాడుతూ ప్రతి ప్రాణిని సంరక్షిస్తూ ధరిత్రిని కాపాడాలని పిలుపునిచ్చారు. పుడమి కేవలం మనుషులదే అనుకోవడం సరికాదన్నారు. ఏయూ నిర్వహించే కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుల్లో జీయర్ స్వామి నిర్వహించే కార్యక్రమాలు అనుసంధానం చేయాలని కోరారు. సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రకృతిని విస్మరిస్తే ముప్పు తప్పదనే విషయాన్ని కథారూపంలో విద్యార్థులకు వివరించారు. ధరిత్రిని కాపాడుకోవడం మనందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో వికాస తరంగిణి సభ్యులు టి.టి.వి రమణ మూర్తి, సాతులూరి రామానుజం, పి.పద్మనాభ రావు, నారాయణ రెడ్డి, అడుసుమిల్లి రాము తదితరులు ప్రసంగించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను, ధరిత్రీ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వక్తృత్వ పోటీలలో విజేతలైన విద్యార్థులను సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.

ధరిత్రిని కాపాడుకుందాం

మురళీనగర్: పుడమితల్లిని కాపాడుకోకుంటే మానవ జాతి మనుగడుకు ముప్పు తప్పదని వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్–101 గవర్నర్ ఉప్పలపాటి శుభ అన్నారు. ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా శనివారం బిర్లా జంక్షన్ అంబేడ్కర్ విగ్రహం నుంచి పంజాబ్ హోటల్ జంక్షన్ వరకు ధరిత్రిని కాపాడుకోవాలంటూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధునికత పేరుతో వృక్షాలను తొలగించడమే కాకుండా వాడి పారేసే ప్లాస్టిక్ వంటి అనేక వ్యర్థాలతో మానవాళి భూమిని నింపేస్తోందన్నారు. ప్లాస్టిక్‌ను నివారిద్దాం.. ధరిత్రిని కాపాడుకుందామని ప్లకార్డు ప్రదర్శించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మట్టి కుండల్లో వేసిన మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ఏరియా కో–ఆర్డినేటర్ పిల్లా అర్జునుడు, శ్రీ స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఆర్.ఆర్.ఎస్.మహేష్, శ్రీ స్టార్ వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు రమణమ్మ, వాకర్స్ ఫీలా రాణి, మాధవి, నాగేశ్వరరావు, ప్రమీల, జ్యోతి, జయ పాల్గొన్నారు.

రూ.9.05 లక్షల చోరీకి పాల్పడ్డ వ్యక్తి అరెస్ట్

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి శంకరమఠం రోడ్డులో గల రామకృష్ణానగర్‌లోని రియల్ ఎస్టేట్ సంస్థ కార్యాలయంలో రూ.9.05 లక్షల నగదు చోరీకి పాల్పడిన సూర్యనారాయణను క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలిలా.. బంగారు రవి, నాయుడు కలిసి రామకృష్ణానగర్‌లో ఎస్ఎస్ రియల్ ఎస్టేట్ సంస్థ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ నెల 17వ తేదీ రాత్రి కార్యాలయ డెస్క్‌లో వారు భద్రపరచిన రూ.9.05 లక్షలు మాయమైంది. రవి, నాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫోర్త్‌టౌన్ క్రైం పోలీసులు కార్యాలయానికి వచ్చి పరిశీలించారు. సంస్థలో పనిచేస్తున్న సూర్యనారాయణ అనే వ్యక్తి నగదు దొంగతనానికి పాల్పడినట్టు గుర్తించి పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు.

800వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు, కార్మికులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం మొదలై 800 రోజులు గడుస్తున్నా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరి కాదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేట్‌పరం చేస్తే చరిత్ర హీనులుగా మిగిలిపోతారని హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 800వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో ఉక్కు కార్మికులకు మద్దతుగా ఐఎన్‌టీయూసీ నాయకులు పాల్గొని, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతున్న మోదీ ప్రభుత్వానికి ప్రజలు, కార్మికులు కలిసి, అదే రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కుతో గట్టి బుద్ధి చెప్తారన్నారు. ఎందరో కార్మికుల బలిదానాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పడం దుర్మార్గమన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వరంగంలోనే కొనసాగుతుందని కేంద్రప్రభుత్వం వెంటనే ప్రకటన విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో రంజాన్



వెంకటాపురంలో ముస్లింలకు కీర్ అందిస్తున్న బెహరా భాస్కరరావు



కొత్తపాలెం మసీదులో ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలు



ఈద్ ముబారక్ చెప్పుకుంటున్న చిన్నారులు

గోపాలపట్నం: రంజాన్ పండగను పశ్చిమ నియోజకవర్గంలోని ముస్లింలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు కౌగిలించుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. దీంతో ఎన్ఏడీ, గోపాలపట్నం ప్రాంతాల్లో సందడి నెలకొంది. ఆత్మీయులకు విందుభోజనాలు పెట్టారు. ఇక్కడి ఆర్ఆర్‌వెంకటాపురంలోని నందమూరినగర్‌లో రంజాన్‌ను పురస్కరించుకుని సేమియాతో తయారు చేసిన మిఠాయిలను జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు అందించారు. కార్యక్రమంలో 91, 92వ వార్డుల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివారావు, అప్పలస్వామి, స్థానిక నాయకులు గొంతెన నాగరాజు, కొండాపు సత్తిబాబు,, షేక్ ఖాదర్, షేక్ ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

పరుగు పోటీల విజేత కనకరాజుకు సత్కారం



గోల్డ్ మెడల్ సాధించిన కనకరాజును సత్కరిస్తున్న సీఐ లూథర్‌బాబు,ఎస్ఐ దేవుడమ్మ

మల్కాపురం: ఈ నెల 16న సికింద్రాబాద్‌లో ఓపెన్ నేషనల్ మీట్ పరుగు పందెంలో పతకాలు సాధించిన ఆకుల కనకరాజును మల్కాపురం సీఐ లూథర్‌బాబు సత్కరించారు. 60వ వార్డు ఇందిరాకాలనీ ప్రాంతానికి చెందిన ఆకుల కనకరాజు విశాఖ జైల్‌లో చేసి ఉద్యోగ విరమణ పొందారు. విధుల్లో ఉన్ననాటి నుంచి అనేక పరుగు పందాలు,బాక్సింగ్ పోటీల్లో రాణించి బహుమతులు,మెడల్స్ సాధించారు. 62 ఏళ్లు పైబడినా పరుగును విడిచిపెట్టలేదు. సికింద్రాబాద్‌లో జరిగిన వంద మీటర్ల పరుగు పందెంలో రెండో స్థానంలో,400 వందల మీటర్లు, 200 మీటర్ల పరుగు పందాల్లో ప్రథమ స్థానంలో నిలిచి గోల్డు మెడల్ సాధించారు. ఈ సందర్భంగా సీఐ లూథర్‌బాబు శనివారం కనకరాజును సత్కరించారు. సీఐ మాట్లాడుతూ కనకరాజుతో కలిసి విశాఖ జైల్‌లో విధులు నిర్వహించానని చెప్పారు. నేటి యువతకు కనకరాజు స్ఫూర్తిగా నిలుస్తారన్నారు. కనకరాజును అభినందించిన వారిలో ఎస్ఐ దేవుడమ్మ, సిబ్బంది ఉన్నారు.

పైడితల్లి అమ్మవారి పండగ పోస్టర్ ఆవిష్కరణ



పండగ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గణబాబు, ఆలయ కమిటీ సభ్యులు

గోపాలపట్నం: పైడితల్లి అమ్మవారి పండగ పోస్టర్‌ను ఆలయ ధర్మకర్త, ఎమ్మెల్యే గణబాబు గోపాలపట్నంలోని ఆయన నివాసం వద్ద శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ గోపాలపట్నం ప్రశాంతినగర్‌లో కొలువు దీరిన అమ్మవారి వార్షిక పండగను మే రెండో తేదీన ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ నిర్ణయించిందని తెలిపారు. ఈ నెల 30న అమ్మవారి ఘటాల సంబరాలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని చెప్పారు. మే 1న తొలేళ్ల పండగ, మంగళవారం ప్రధాన పండగ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బుద్దా శివాజీ, చందన గాంధీ, గాంధ్రెడ్డి పెద బాబు, భవాని ఈశ్వరరావు, నారిపిన్ని సత్తిరాజు, రాజశేఖర్, సీతారాం, మళ్ల సతీష్, చింతల భాస్కరరావు, బాబి తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో సత్తాచాటిన జ్యోత్స్న, హర్షిత

విశాఖ స్పోర్ట్స్ : ఏపీ అంతరజిల్లాల మెన్, వుమెన్ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో జ్యోత్స్న, హర్షిత మొత్తంగా 300+కేజీల బరువును ఎత్తి సత్తా చాటారు. రెండు రోజుల పాటు సబ్ జూనియర్స్, జూనియర్స్‌తో పాటు మాస్టర్స్‌కు ఈ పోటీలు స్క్వాట్, బెంచ్‌ప్రెస్‌తో పాటు డెడ్‌లిఫ్ట్ అంశాల్లోనూ జరగనున్నాయి. ఏయూ ఇండోర్ జిమ్నాజియంలో తొలిరోజు సబ్ జూనియర్ బాలికల 43 కేజీల వెయిట్ కాటగిరీలో ఎం. షనూన్ స్క్వాట్‌లో 75 కేజీలు, బెంచ్‌ప్రెస్‌లో 27.5కేజీలు, డెడ్‌లిఫ్ట్‌లో 90 కేజీలతో మొత్తంగా 192.5కేజీల బరువునెత్తి తొలి స్థానంలో నిలిచింది. బి.దీక్షిత, సీహెచ్ దౌలశ్రీ వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. 52 కేజీల బరువులో ఎ.జ్యోత్స్న స్క్వాట్‌లో 140 కేజీలు, బెంచ్‌ప్రెస్‌లో 70 కేజీలు, డెడ్‌లిఫ్ట్‌లో 135 కేజీలతో మొత్తంగా 345 కేజీల బరువునెత్తి తొలి స్థానంలో నిలిచింది. ఎ.ప్రవల్లిక, కే.ఆశ్రిత వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. 57 కేజీల వెయిట్‌లో ఎస్.కృష్ణవేణి స్క్వాట్‌లో 80 కేజీలు, బెంచ్‌ప్రెస్‌లో 42.5 కేజీలు, డెడ్‌లిఫ్ట్‌లో 100 కేజీలతో మొత్తంగా 222.5 కేజీల బరువునెత్తి తొలిస్థానంలో నిలిచింది. ఆర్.వందన, ఎం.జనని వరుసగా ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచారు. 63 కేజీల వెయిట్‌లో హర్షిత తివారి స్క్వాట్‌లో 125 కేజీలు, బెంచ్‌ప్రెస్‌లో 60 కేజీలు, డెడ్‌లిఫ్ట్‌లో 140 కేజీలతో మొత్తంగా 325 కేజీల బరువునెత్తి తొలిస్థానంలో నిలిచింది. ఎస్.లక్ష్మి, ఎం.పూర్ణిమ వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. 69 కేజీల వెయిట్‌లో జి.సుభాషిణి స్క్వాట్‌లో 120 కేజీలు, బెంచ్‌ప్రెస్‌లో 45 కేజీలు, డెడ్‌లిఫ్ట్‌లో 125 కేజీలతో మొత్తంగా 290 కేజీల బరువునెత్తి తొలి స్థానంలో నిలిచింది. ఎస్.షైనీ, పి.భానుశ్రీ వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు.

మొక్కల పెంపకంతో పర్యావరణానికి మేలు

మురళీనగర్: మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో సిటీ టెర్రస్ గార్డెన్స్, వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ ధరిత్రి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్కులో నీడనిచ్చే మొక్కలతోపాటు బ్యూటిఫికేషన్ మొక్కలు నాటారు. మనిషికి, మట్టికి ఉన్న అవినాభావ సంబంధం, పర్యావరణానికి జరిగే మేలు గురించి వక్తలు వివరించారు.